నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM



తగ్గిన పెట్రోల్ ధరలు

దేశవ్యాప్తంగా పెట్రోల్ ధరలు తగ్గాయి. కేంద్రం గురువారం పెట్రోల్, డీజిల్ ధరలను రూ.2 మేర తగ్గించగా, కొత్త ధరలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.107.66, డీజిల్ ధర రూ.95.82గా ఉంది. స్థానిక పన్నులు, దూరాన్ని బట్టి ఇంధనాల రేట్లు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా ఉంటాయి. 2022 ఏప్రిల్ 6 నుంచి పెట్రో ధరల్లో ఎలాంటి మార్పు చేయని కేంద్రం.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది.

వైసీపీలోకి ముద్రగడ పద్మనాభం

నేడు సీనియర్ రాజకీయ నేత, మాజీ రాష్ట్ర మంత్రి, కాపు ఉద్యమ నేతైన ముద్రగడ పద్మనాభం సీఎం జగన్ సమక్షంలో వైసీపీ లో చేరారు. నేటి ఉదయం తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షాన పార్టీ కండువా కప్పుకున్నారు. ముద్రగడ పద్మనాభంతో పాటు ఆయన కుమారుడు గిరి కూడా వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ.. వైసీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈయన గత కొద్ది రోజులుగా ఏ పార్టీలోకి వెళ్తారనే చర్చ ఆంధ్ర రాజకీయాలలో తీవ్రంగా నడిచింది. కాకపోతే.., సీఎం జగన్ పాలనతోనే అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరుగుతుందని నిర్ధారించుకున్న ఆయన చివరకు వైసీపీ వైపే మొగ్గు చూపారు. ఇక ముద్రగడ పద్మనాభం రాజకీయ ప్రస్థానం చూస్తే.. 1978లో జనతా పార్టీతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించాక అందులో ముద్రగడ చేరారు. తెలంగాణ రాకముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఏకంగా 4 సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఈయన గెలుపొందారు. 1999 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరపున కాకినాడ లోక్ సభ స్థానంలో గెలిచారు. అంతేకాదు వేరు వేరు ప్రభుత్వాల్లో మంత్రిగానూ ఆయన పని చేశారు.

సింగరేణిలో 327 ఉద్యోగాలకు నోటిఫికేషన్

సింగరేణి సంస్థ 327 పోస్టులతో నోటిఫికేషన్ జారీ చేసింది. ఏడు కేటగిరీల్లోని ఈ ఉద్యోగాలకు ఏప్రిల్ 15 నుంచి మే 4 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సీఎండీ బలరాం తెలిపారు. మరిన్ని వివరాలకు సింగరేణి వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. భర్తీ చేయనున్న పోస్టులివే..

ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో.. మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఈఅండ్ఎం) ఈ2 గ్రేడ్- 42, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సిస్టమ్స్) ఈ2 గ్రేడ్- 7.

నాన్ ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో.. జూనియర్ మైనింగ్ ఇంజినీరు టీఅండ్ఎస్ గ్రేడ్ సీ- 100, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(మెకానికల్) టీఅండ్ఎస్ గ్రేడ్ సీ- 9, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రైనీ(ఎలక్ట్రికల్) టీ అండ్ ఎస్ గ్రేడ్ సీ- 24, ఫిట్టర్ ట్రైనీ కేటగిరీ-1- 47, ఎలక్ట్రీషియన్ ట్రైనీ కేటగిరీ-1- 98.

రజాకార్ మూవీ రివ్యూ

తెలంగాణ విముక్తి పోరాటం నేపథ్యంలో సాగే చారిత్రక కథాంశంతో రూపొందిన సినిమా 'రజాకార్'. రాజకీయంగా ఎన్నో వివాదాలకు కేంద్రంగా నిలిచిన ఈ చిత్రం ఎన్నో అడ్డంకుల్ని దాటుకొని ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకొచ్చింది. మరి ఈ సినిమాలో తెలంగాణ పోరాట యోధుల గాథను ఎలా చూపించారు? అందులో వివాదాస్పదమైన అంశాలు ఏమైనా ఉన్నాయా?

కథేంటంటే: భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజాం ఏడో రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ (మకరంద్ దేశ్ పాండే) ఏలుబడిలో ఉన్న రోజులవి. దేశంలోని అన్ని రాజ్యాలను.. సంస్థానాలను భారత్‌లో విలీనం చేయాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంటుంది. కానీ, నిజాం ప్రభువు మాత్రం అందుకు ససేమిరా అంటాడు. తమ దగ్గరున్న రజాకార్లు అనే ప్రైవేటు సైన్యం సహకారంతో హైదరాబాద్ సంస్థానాన్ని తుర్కిస్తాన్ అనే దేశంగా ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంటాడు. దీనికోసం రజాకార్ల చీఫ్ ఖాసిం రిజ్వీ (రాజ్ అర్జున్).. అప్పటి నిజాం ప్రధాని లాయక్ అలీ ఖాన్ (జాన్ విజయ్) ఓ పెద్ద కుట్రకు తెరలేపుతారు. తమ రాజ్యంలోని హిందువులను బలవంతంగా మతమార్పిడులు చేయించే ప్రయత్నం చేస్తారు. ఉర్దూని అధికార భాషగా ప్రకటిస్తూ.. తెలుగు, కన్నడ, మరాఠి తదితర భాషలపై నిషేధం విధిస్తారు. అలాగే ఇష్టారీతిన చిత్ర విచిత్రమైన పన్నులు విధిస్తూ ప్రజల్ని దారుణంగా హింసిస్తుంటారు. ఈ క్రమంలో వారికి ఎదురు తిరిగిన ఎన్నో ఊళ్లలో దారుణ మారణ హోమం సృష్టిస్తారు. అయితే అప్పటి భారత హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ (రాజ్ సప్రు) నిజాం దురాగతాలు తెలుసుకుని హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు పోలీస్ చర్యకు సిద్ధపడతారు. మరి ఆ తర్వాత ఏమైంది? నిజాం ప్రభువు నుంచి స్వాతంత్ర్యం సాధించే క్రమంలో తెలంగాణ ప్రజలు ఎలాంటి పోరాటం చేశారు? వాళ్లను అణగదొక్కేందుకు రజాకార్లు ఎలాంటి అకృత్యాలకు పాల్పడ్డారు? భారత ప్రభుత్వం చేపట్టిన పోలీస్ చర్య ఫలితాన్నిచ్చిందా? లేదా? అన్నది తెరపై చూసి తెలుసుకోవాలి.

ఎలా సాగిందంటే: ప్రపంచంలోని పోరాటాల్లో తెలంగాణ సాయుధ పోరాటానికి ఎంతో ప్రత్యేక స్థానం ఉంది. అప్పట్లో నిజాం పరిపాలనలో హైదరాబాద్ సంస్థానంలో ఎలాంటి అరాచకాలు, అకృత్యాలు జరిగాయి.. గ్రామాల్లో రజాకార్లు ఎంతటి దురాగతాలకు పాల్పడ్డారు.. వారిని ఎదిరించి పోరాడే క్రమంలో ప్రజలే సాయుధులై కదన రంగంలోకి దూకిన తీరు.. ఈ క్రమంలో వీర మరణం పొందిన వేలాది యోధుల కథలు.. తెలంగాణ చరిత్రలో ఇప్పటికీ సజీవం. చరిత్ర పుటల్లో దాగిన ఆ నెత్తుటి కథల్నే 'రజాకార్' రూపంలో భావోద్వేగభరితంగా తెరపై చూపించే ప్రయత్నం చేశారు దర్శకుడు యాట సత్యనారాయణ. టైటిల్ కార్డ్స్ తో తెలంగాణ చరిత్రను పరిచయం చేసి.. స్వాతంత్ర్యానంతరం దేశంలోని పరిస్థితుల్ని.. అప్పటి హైదరాబాద్ సంస్థానంలో నిజాం పరిపాలనను చూపిస్తూ నేరుగా అసలు కథలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఇక అక్కడి నుంచి రజాకార్ల దుశ్చర్యలను ఒక్కొక్కటిగా పరిచయం చేస్తూ సినిమాని ఆసక్తికరంగా ముందుకు నడిపించారు. అప్పట్లో తబ్లిగ్ ఫర్మానా పేరుతో రజాకార్లు ప్రజల్ని బలవంతంగా మత మార్పిడి చేయించిన తీరు.. తెలుగు భాష మాట్లాడుతున్నారన్న అక్కసుతో బడుల్లో పిల్లలపై వారు చేసిన దారుణాలు.. ఊళ్లలో మహిళలు, ఆడపిల్లలపై రజాకార్లు, వాళ్ల ప్రతినిధుల అఘాయిత్యాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తూ ప్రథమార్ధం సాగుతుంది. అయితే దీంట్లో ప్రత్యేకంగా హీరోలంటూ ఎవరూ కనిపించరు. ఎందుకంటే ప్రతి పది పదిహేను నిమిషాలకు ఒకసారి ఓ శక్తిమంతమైన పాత్ర తెరపైకి వచ్చి తనదైన పోరాట స్ఫూర్తిని చూపించి మాయమవుతుంటుంది. ఇవన్నీ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ఉన్న వీరగాథలే. అయితే అవన్నీ తెలిసిన కథలే అయినా తెరపై చూసినప్పుడు రోమాలు నిక్కబొడుచుకునేలా ఉంటాయి. కొన్ని ఎపిసోడ్లలో రజాకార్ల అకృత్యాలు చూస్తున్నప్పుడు వాళ్లు కనిపిస్తే నిజంగా మనమే తిరగబడాలన్నంత ఆవేశం కలిగించేలా ఉంటాయి. పథమార్ధంలో ఎక్కువగా రజాకర్ల అకృత్యాలను చూపిస్తే.. ద్వితీయార్ధంలో వారికి ఎదురు తిరిగిన ప్రజల పోరాట స్ఫూర్తిని చూపించే ప్రయత్నం చేశారు దర్శకుడు. ఈ క్రమంలో వచ్చే బైరాన్‌పల్లె వాసుల సాయుధ పోరాటం.. పరకాల జెండా ఉద్యమం.. ఈశ్వరయ్య-గండయ్య గ్యాంగ్ నిజాం ప్రభువుపై చేసే బాంబ్ ఎటాక్ ఎపిసోడ్.. అన్నీ ఆకట్టుకునేలా ఉంటాయి. ప్రథమార్ధంతా తెర వెనుక ఉండి చర్చలు జరుపుతూ కూర్చున్నట్లు ఉన్న సర్దార్ వల్లభభాయ్ పటేల్ పాత్ర ప్రీక్లైమాక్స్‌లో తెరపైకి వచ్చి నిజాం రాజ్యంలోకి అడుగుపెట్టడంతో కథకు ఊపొస్తుంది. ఈ క్రమంలో ఖాసీం రిజ్వీకి పటేల్ ఇచ్చే వార్నింగ్ ఎపిసోడ్ హైలైట్. ఇక పతాక సన్నివేశాలు భారత ప్రభుత్వం చేపట్టే పోలీస్ చర్యతో సాగుతాయి. కానీ, ఆ ఎపిసోడ్‌ను మరీ అంత ఆసక్తికరంగా చూపించలేకపోయారనిపిస్తుంది. నిజానికి తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్ట్‌ల పాత్ర ఎంతో కీలకం. కానీ, సినిమాలో మాత్రం భారత సైన్యం రంగంలోకి దిగగానే వాళ్లు ఉద్యమం నుంచి పక్కకు తప్పుకొన్నట్లు చూపించారు. అదంత సహేతుకంగా అనిపించదు.

ఎవరెలా చేశారంటే: ఈ సినిమాలో ప్రత్యేకంగా ఫలానా పాత్రే కీలకం అని చెప్పడానికేం లేదు. ఒక్కో ఎపిసోడ్‌కు ఒక్కో పాత్ర హీరోగా నిలిచింది. చాకలి ఐలమ్మగా ఇంద్రజ, రాజిరెడ్డిగా బాబీ సింహా, శాంతమ్మగా వేదిక, నిజాం రాజుగా మకరంద్ దేశ్ పాండే, సర్దార్ వల్లభభాయ్ పటేల్‌గా రాజ్ సప్రు, కాసిం రిజ్వీగా రాజ్ అర్జున్, లాయక్‌గా జాన్ విజయ్... ఇలా ప్రతిఒక్కరూ తమ తమ పాత్రల్లో ఒదిగిపోవడమే కాదు.. అద్భుతమైన నటనతో అదరగొట్టారు. ముఖ్యంగా కాసీం రిజ్వీ పాత్రలో రాజ్ అర్జున్ కనబర్చిన నటన.. పలికించిన హావభావాలు.. సంభాషణలు పలికిన తీరు ప్రేక్షకుల్ని కట్టిపడేస్తాయి. దర్శకుడు యాట సత్యనారాయణ తను రాసుకున్న కథను యథాతథంగా తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు.

ఓటిటిలో స్ట్రీమింగ్ కి వచ్చేసిన భ్రమ యుగం

మోలీవుడ్ లో నటించిన ఇంట్రెస్టింగ్ హారర్ థ్రిల్లర్ చిత్రం "భ్రమ యుగం" కూడా ఒకటి. దర్శకుడు రాహుల్ సదాశివన్ తెరకెక్కించిన ఈ చిత్రం మళయాళ మూవీ లవర్స్ ని ఆకట్టుకోవడమే కాకుండా తెలుగు ఆడియెన్స్ ని కూడా ఇంప్రెస్ చేసింది. అలాగే మమ్ముట్టి కెరీర్ లో మరో ఇంట్రెస్టింగ్ ప్రయోగంగా మారిన ఈ చిత్రం ఇప్పుడు ఫైనల్ గా ఓటిటి రిలీజ్ కి వచ్చేసింది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు ప్రముఖ సంస్థ సోనీ లివ్ వారు సొంతం చేసుకోగా ఇందులో ఈ చిత్రం ఈరోజు నుంచి మళయాళం సహా తెలుగు, తమిళ్ మరియు కన్నడ హిందీ భాషల్లో కూడా స్ట్రీమింగ్ కి వచ్చేసింది. మరి ఈ చిత్రాన్ని అప్పుడు థియేటర్స్ లో మిస్ అయ్యి ఇప్పుడు చూడాలి అనుకునేవారు ఇప్పుడు సోనీ లివ్ లో ట్రై చేయవచ్చు. ఇక ఈ చిత్రానికి క్రిస్టో జావియర్ సంగీతం అందించగా నైట్ షిఫ్ట్ స్టూడియోస్ మరియు వై నాట్ స్టూడియోస్ వారు నిర్మాణం వహించారు.



ఎన్నికల కమిషనర్లుగా బాధ్యతలు చేపట్టిన

సుఖ్‌బీర్, జ్ఞానేశ్

కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, జ్ఞానేశ్ కుమార్ నియమితులైన విషయం తెలిసిందే. తాజాగా వీరు ఈసీఐలో చేరారు. కమిషనర్లుగా శుక్రవారం ఉదయం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘానికి రాజీవ్ కుమార్ చీఫ్ కమిషనర్‌గా ఉన్నారు. కమిషనర్‌గా ఉన్న అనూప్ చంద్ర పాండే గత నెలలో పదవీ విరమణ చేయగా.. మరో కమిషనర్ అరుణ్ గోయెల్ ఇటీవలే అనూహ్యంగా రాజీనామా చేశారు. దీంతో కొత్త కమిషనర్ల నియామకం అనివార్యమైంది. గురువారం ప్రధాని మోదీ నేతృత్వంలో సమావేశమైన కమిటీ కొత్త కమిషనర్లుగా సుఖ్‌బీర్ సింగ్ సింధూ, జ్ఞానేశ్ కుమార్‌లను ఎంపిక చేసింది. ఈ మేరకు గురువారం కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. తాజాగా వీరు కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా బాధ్యతలు చేపట్టారు.

నేడు సుప్రీంలో విచారణ

ఈసీ కమిషనర్ల ఎంపిక ప్రక్రియపై సుప్రీం లో నేడు విచారణ జరగనుంది. కేంద్ర ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుంచి సీజేఐని తప్పించి ఆ స్థానంలో క్యాబినెట్ మంత్రిని చేర్చటాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

కర్ణాటక మాజీ సీఎం యడియూరప్పపై పోక్సో కేసు

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ సీనియర్ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్. యడియూరప్ప (81)పై లైంగిక వేధింపుల ఆరోపణలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. 17 ఏళ్ల బాలికపై ఆయన లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆయనపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నెల రోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. మోసం కేసులో సాయం చేయాలంటూ బాధితురాలు, ఆమె తల్లి ఫిబ్రవరి 2న యడియూరప్పను కలిశారు. ఆ సమయంలో తన కుమార్తెను భాజపా నేత బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారంటూ బాధితురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వాళ్లు పోలీసులను ఆశ్రయించగా.. అర్ధరాత్రి తర్వాత పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు.

పౌరసత్వ చట్టంపై అమెరికా కీలక వ్యాఖ్యలు

పౌరసత్వ సవరణ చట్టం అమలు కోసం భారత్ ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్‌పై అగ్రరాజ్యం అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ అంశం తమని ఆందోళనకు గురిచేస్తోందని పేర్కొంది. దీన్ని ఎలా అమలు చేయనున్నారో నిశితంగా పరిశీలిస్తున్నామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ గురువారం అన్నారు. "మార్చి 11న వచ్చిన సీఏఏ నోటిఫికేషన్‌పై మేం ఆందోళన చెందుతున్నాం. దీన్ని ఎలా అమలు చేయనున్నారో నిశితంగా గమనిస్తున్నాం. మత స్వేచ్ఛ, చట్ట ప్రకారం అన్ని వర్గాల వారిని సమానంగా చూడడం ప్రజాస్వామ్య మూల సూత్రం." అని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు మిల్లర్ సమాధానమిచ్చారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థుల వద్ద తగిన పత్రాలు లేకపోయినా వారికి సత్వరం మన పౌరసత్వాన్ని ఇచ్చేందుకు వీలుగా కేంద్రం సీఏఏ-2019ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీనికి 2019లోనే పార్లమెంటు, రాష్ట్రపతి ఆమోదం లభించాయి. కానీ, విపక్షాల ఆందోళనలు, దేశవ్యాప్తంగా నిరసనల కారణంతో దీన్ని వెంటనే అమల్లోకి తీసుకురాలేదు. తాజాగా సార్వత్రిక ఎన్నికలకు ముందు దీని అమలు విధివిధానాలను పేర్కొంటూ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని వల్ల ముస్లింల పౌరసత్వం పోదని కేంద్రం స్పష్టం చేసింది.

నుదుటిపై మూడు కుట్లు.. నిలకడగానే దీదీ ఆరోగ్యం

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అసుపత్రిపాలైన విషయం తెలిసిందే. 69 ఏండ్ల దీదీ గురువారం సాయంత్రం తన ఇంట్లో పడిపోవడంతో ఆమె నుదుటిపై పెద్ద గాయం అయ్యింది. దీంతో ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే సీఎం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు రాష్ట్ర పరిపాలన సీనియర్ అధికారి శుక్రవారం తెలిపారు. సీఎం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. సీనియర్ వైద్యులు ఆమెను నిశితంగా గమనిస్తున్నారు. రాత్రి కూడా ఆమె బాగానే నిద్రపోయారు' అని సదరు అధికారి మీడియాకు వెల్లడించారు. నుదుటిపై మూడు కుట్లు. ముక్కుపై ఒక కుట్టు వేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరీక్షల అనంతరం డిశ్చార్జ్ అయినట్లు తెలిపారు. దీదీ గురువారం సాయంత్రం ఒక కార్యక్రమానికి హాజరై తన ఇంటికి వచ్చారు. ఇంట్లో పడిపోవటంతో ఆమె నుదుటిపై పెద్ద గాయం అయ్యిందని, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ వెంటనే దవాఖానకు తరలించినట్టు టీఎంసీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు రక్తం వస్తున్న ఫొటోలను పోస్ట్ చేశారు. దీదీ ప్రస్తుతం కోల్‌కతాలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఎంపీగా పోటీపై పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు



ఎంపీగా పోటీ చేయడంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొందరు పార్టీ పెద్దలు తనను ఎంపీగా పోటీ చేయాలని కోరారని తెలిపారు. తనకు మాత్రం ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఉందని పవన్ తన మనసులో మాట చెప్పారు. ఎంపీగా పోటీ చేస్తానో? లేదో? కొద్దిరోజుల్లో తెలుస్తుందన్నారు. బీజేపీకి సీట్లు ఇవ్వడం వల్లే జనసేన ఎక్కువ సీట్లు నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సూర్య
www.suryaa.com

కేతిక శర్మ బోల్డ్ ట్రీట్

మోడల్ గా కెరీర్ ప్రారంభించిన కేతిక శర్మ తన స్టన్నింగ్ గ్లామర్, హాట్ స్ట్రక్చర్ తో తెలుగు ఫిలిం మేకర్స్ ని ఆకర్షించింది. చివరగా కేతిక 'బ్రో' మూవీలో సాయిధరమ్ తేజ్ కి జోడిగా మెరిసింది. మోడల్ గా కెరీర్ ప్రారంభించిన కేతిక శర్మ తన స్టన్నింగ్ గ్లామర్, హాట్ స్ట్రక్చర్ తో తెలుగు ఫిలిం మేకర్స్ ని ఆకర్షించింది. చివరగా కేతిక 'బ్రో' మూవీలో సాయి ధరమ్ తేజ్ కి జోడిగా మెరిసింది. ఫలితంగా ఆకాష్ పూరి సరసన రొమాంటిక్ చిత్రంలో నటించే ఛాన్స్ కొట్టేసింది. ఈ చిత్రంలో ఘాటుగా అందాలు ఆరబోసి యువతకి కలల రాణిగా మారింది. కానీ రొమాంటిక్ చిత్రం విజయం సాధించలేదు. ఆ తర్వాత నటించిన లక్ష్య చిత్రం కూడా నిరాశపరిచింది. కానీ కేతిక మాత్రం సోషల్ మీడియాలో తన గ్లామర్ తో యువతలో క్రేజీ పెంచుకుంటూ వెళ్ళింది. కుర్రాళ్ల మతులు చెడిపోయే విధంగా గ్లామర్ హద్దులు చెరిపేస్తూ కేతిక గ్లామర్ విన్యాసాలు ప్రదర్శించింది. దీనితో కేతికకి మరోసారి నిరాశ తప్పలేదు. కేతిక శర్మ చివరగా పవన్ కళ్యాణ్, సాయిధరమ్ తేజ్ బ్రో చిత్రంలో నటించి మంచి అటెన్షన్ కొట్టేసింది. అయితే బ్రో మూవీ బాక్సాఫీస్ వద్ద జోరు మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. తొలి విజయం కేతికని ఇంకా ఊరిస్తూనే ఉంది. సినిమా రిజల్ట్స్ ఎలా ఉన్నప్పటికీ కేతిక ఫ్యాన్స్ కి గ్లామర్ ట్రీట్ ఇస్తూనే ఉంది. తాజాగా కేతిక శర్మ మైండ్ బ్లాక్ అయ్యే ఫోజులు ఇచ్చింది. వాలంటైన్స్ డే రోజున యువత విరహంలో మునిగిపోయేలా తన ఘాటైన అందాలతో బోల్డ్ ట్రీట్ ఇచ్చింది. రెడ్ డ్రెస్ లో కేతిక వంగి వంగి ఇస్తున్న ఫోజులు ఇంటర్నెట్ లో మంటలు పెట్టే విధంగా ఉన్నాయి.



సేవ్ ద టైగర్స్ 2 రివ్యూ

ప్రియదర్శి, అభినవ్ గోమఠం, చైతన్య కృష్ణ హీరోలుగా.... 'జోర్దార్' సుజాత, పావని గంగిరెడ్డి, దేవియాని శర్మ హీరోయిన్లుగా నటించిన వెబ్ సిరీస్ 'సేవ్ ద టైగర్స్'. మహి వి రాఘవ్ షో రన్నర్ & క్రియేటర్. ఓటీటీ వీక్షకులను విపరీతంగా నవ్వించిందీ సిరీస్. ఇప్పుడు సెకండ్ సీజన్ (Save The Tigers Season 2) వచ్చింది. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఇందులో సీరత్ కపూర్, దర్శనా బానిక్ యాడ్ అయ్యారు. అరుణ్ కొత్తపల్లి దర్శకత్వం వహించారు. ఈ సిరీస్ ఎలా ఉంది? నవ్విస్తుందా? అనేది రివ్యూలో చూద్దాం. 'సేవ్ ద టైగర్స్' ఫస్ట్ సీజన్ ముగిసిన చోటు నుంచి సీజన్ 2 మొదలైంది.

హీరోయిన్ హంసలేఖ (సీరత్ కపూర్) ఎక్కడ? అని పోలీస్ స్టేషన్‌లో విక్రమ్ (చైతన్య కృష్ణ), రాహుల్ (అభినవ్ గోమఠం), గంటా రవి (ప్రియదర్శి)లను ప్రశ్నిస్తారు. ఆమె మిస్సింగ్ కేసులో ముగ్గురికీ గట్టిగా లాఠీ ట్రీట్‌మెంట్ ఇస్తారు. తమకు తెలియదని ఎంత చెప్పినా పోలీసులు వినరు. వాళ్లకు స్టార్ హోటల్ నుంచి హంసలేఖను తీసుకువెళ్లిన వీడియో చూపిస్తారు. ఆ ముగ్గురూ కలిసి ఆమెను చంపేశారేమో అని న్యూస్ ఛానళ్లు అనుమానం వ్యక్తం చేస్తాయి. అదంతా అబద్ధమని, తాము కలిసి పార్టీ చేసుకున్నామని హంసలేఖ డైరెక్టుగా వచ్చి చెప్పడంతో వదిలేస్తారు పోలీసులు. స్టేషన్ నుంచి విక్రమ్, రవి, రాహుల్ బయటకు వచ్చిన తర్వాత ఏం జరిగింది? ఆ ముగ్గురి భార్యలు స్పందన (సత్యకృష్ణ) దగ్గరకు ఎందుకు వెళ్లారు? రవికి కార్పొరేటర్ టికెట్ ఇస్తానని ఎమ్మెల్యే ఎందుకు చెప్పాడు? గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్ కొనుకోవాలన్న రవి భార్య హైమావతి (జోర్దార్ సుజాత) కల నెరవేరిందా? లేదా? విక్రమ్ భార్య రేఖ (దేవియాని శర్మ) లాయర్ ప్రాక్టీస్ ఎందుకు ఆపేయాలని అనుకుంది? రాహుల్, అతని భార్య మాధురి (పావని గంగిరెడ్డి) మధ్య హోరిక (దర్శనా బానిక్) ఎవరు? మూడు జంటల మధ్య గొడవలకు కారణం ఏమిటి? అనేది సిరీస్ చూసి తెలుసుకోవాలి.

కళ్లతో చూసేది ప్రతిదీ నిజం కాదు... 'సేవ్ ద టైగర్స్ 2'లో అంతర్లీనంగా ఉందీ సందేశం. టీవీ ఛానళ్లలో వైరల్ న్యూస్ చూస్తుంటాం, హీరోయిన్ల గురించి గాసిప్స్ చదువుతాం, ఎక్కడో ఎవరినో చూసి వాళ్లు ఏదో చేస్తు న్నారని భావిస్తాం... నిజమని నమ్మేస్తాం. అసలు ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేసే తీరిక, ఓపిక తక్కువ మందికి ఉంటోంది. అసలు విషయం తెలుసుకోకుండా ఓ అభిప్రాయానికి రావడం వల్ల జీవితాలు ఎలాంటి పరిస్థితుల్లోకి వెళుతున్నాయనేది 'సేవ్ ద టైగర్స్ 2'లో చక్కగా చెప్పారు. అయితే... ఎక్కడా క్లాస్ పీకినట్లు ఉండదు. అదీ మహి వి రాఘవ్ క్రియేషన్‌లో స్పెషాలిటీ. మహి వి రాఘవ్ రచనలో డ్రామా బాగుంటుంది. మంచి కామెడీ టైమ్ కూడా ఉందని 'ఆనందో బ్రహ్మ' చూస్తే అర్థం అవుతుంది. 'సేవ్ ద టైగర్స్' విషయంలోనూ కామెడీతో సక్సెస్ అందుకున్నారు. రియాలిటీకి దగ్గరగా తీయడం ఆ సిరీస్ సక్సెస్ ఫార్ములా. 'సేవ్ ద టైగర్స్ 2'లో అంతర్లీనంగా సందేశం ఉన్నా... రియాలిటీ, కామెడీ, డ్రామా మిస్ కాకుండా చూసుకున్నారు మహి. ప్రదీప్ అద్వైతంతో కలిసి మహి వి రాఘవ్ క్రియేట్ చేసిన 'సేవ్ ద టైగర్స్ 2'లో ఫస్ట్ మూడు ఎపిసోడ్స్ హిలేరియస్ అని చెప్పవచ్చు. నాలుగో ఎపిసోడ్‌లో 10000BC ట్రాక్ నవ్వించలేదు. వివాహ వ్యవస్థ పుట్టుక వెనుక చెప్పిన కథ ఆకట్టుకోదు. ఆ తర్వాత మళ్లీ ట్రాక్‌లోకి వచ్చిందీ సిరీస్. కామెడీతో పాటు ఎమోషన్స్ బ్యాలన్స్ చేస్తూ క్లైమాక్స్‌కు చేరుకుంది. ప్రియదర్శి - సుజాత, చైతన్యకృష్ణ - దేవియాని శర్మ మధ్య సన్నివేశాలతో పలు జంటలు రిలేట్ అవుతాయి. కార్పొరేటర్ టికెట్ ఇస్తానని ఎమ్మెల్యే చెబితే ముందు వెనుక ఆలోచించకుండా రవి (ప్రియదర్శి) డబ్బులు ఇవ్వడం... ఆఫీసులో మరొక అమ్మాయికి, రాహుల్ (చైతన్య కృష్ణ) మధ్య సన్నివేశాలు ఇంకా బాగా రాసుకోవాల్సింది. మహి వి రాఘవ్ క్రియేషన్, అరుణ్ కొత్తపల్లి డైరెక్షన్ మధ్య సింక్ కుదిరింది. చిన్నా వాసుదేవరెడ్డి, మహి వి రాఘవ్ నిర్మాణ విలువలు బావున్నాయి. అజయ్ అరసాడ సంగీతం కథతో పాటు సాగింది.

ప్రియదర్శి, అభినవ్ గోమఠం, చైతన్య కృష్ణ... ముగ్గురి నటన బావుంది. అయితే... కుమార్తె పెద్దమనిషి అయ్యాక ఆమెతో మాట్లాడిన సన్నివేశంలో గానీ, స్కూల్‌లో తన గురించి కుమార్తె మాట్లాడిన వీడియో చూసేటప్పుడు గానీ ప్రియదర్శి నటన టాప్ క్లాస్. ఆయన భావోద్వేగాలు పలికించిన తీరు అద్భుతం. అభినవ్ గోమఠం కామెడీ టైమింగ్, ఆ డైలాగ్ డెలివరీ గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎప్పటిలా బాగా చేశారు. రాహుల్ పాత్రలో చైతన్యకృష్ణ జీవించారు. జోర్దార్ సుజాత, దేవియాని శర్మ, పావని గంగిరెడ్డి సైతం తమ తమ క్యారెక్టర్లలో జీవించారు.

హంసలేఖగా సీరత్ కపూర్ చక్కగా నటించారు. భార్యాభర్తలుగా సత్యకృష్ణ, వేణు ఎల్దండి సన్నివేశాలు నవ్విస్తాయి. దర్శనా బానిక్ పాత్ర నిడివి తక్కువ. గంగవ్వ, ముక్కు అవినాష్ తదితరులు తమ పరిధి మేరకు చేశారు. రోహిణి మరోసారి మాస్ మెయిడ్ క్యారెక్టర్‌లో నవ్వించారు. 'సేవ్ ద టైగర్స్ 2'... ఈ సిరీస్ నవ్విస్తుంది, వైఫ్ అండ్ హస్బెండ్ ఎలా ఉండాలో చెబుతుంది, తండ్రీ కూతుళ్ళ అనుబంధం చూపిస్తుంది, ఎన్ని సవాళ్లు ఎదురైనా వెనకడుగు వేయవద్దని ధైర్యం ఇస్తుంది. కామెడీతో పాటు ఎమోషన్స్ మిమ్మల్ని ఆకట్టుకుంటాయి. వీకెండ్ మీ టైమ్ అడ్జస్ట్ చేసుకోండి... హ్యాపీగా సిరీస్ చూడండి.

ఇవాళ ఎలిమినేటర్.. ఫైనల్ టికెట్ కోసం

ముంబై, బెంగళూరు బిగ్ ఫైట్

మహిళల ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌లో భాగంగా ఈ రోజు రాత్రి కీలకమైన ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ గ్రౌండ్ వేదికగా జరిగే ఈ హోరాహోరీ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ఈ సీజన్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని ముంబై జట్టు రెండో స్థానంలో నిలవగా, RCB మూడో స్థానంలో నిలిచింది. ఇక బుధవారం సాయంత్రం ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో మెగ్ లానింగ్ నేతృత్వంలోని ఢిల్లీ జట్టు మళ్లీ విజయం సాధించి ఫైనల్‌కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. గత సీజన్‌లోనూ ఢిల్లీ తొలిసారి ఫైనల్‌కు చేరుకుంది. అయితే ఫైనల్‌లో ముంబై చేతిలో ఓడిపోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఈ రోజు రెండో ఫైనలిస్ట్‌గా మారేందుకు ముంబై ఇండియన్స్, RCB జట్లు పోటీపడుతున్నాయి. బెంగళూరు జట్టు ఈ సీజన్‌లో మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు ఆడగా, నాలుగింటిలో విజయం సాధించింది. అదే సమయంలో ముంబై ఎనిమిది మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు సాధించింది. ఈ సీజన్‌లో ఇరు జట్లు రెండుసార్లు తలపడ్డాయి. ఒక మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టు గెలుపొందగా, మరొక మ్యాచ్ లో RCB గెలిచింది. ఇదిలా ఉంటే, గత సీజన్‌లో కూడా రెండు జట్ల మధ్య రెండు లీగ్ మ్యాచ్‌లు జరగగా, రెండు మ్యాచ్‌ల్లోనూ ముంబై విజయం సాధించింది. మార్చి 12న జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ స్టార్ ఆల్‌రౌండర్ ఎల్లిస్ పెర్రీ ధీటైన ప్రదర్శన చేసి కేవలం 15 పరుగులకే ఆరు వికెట్లు పడగొట్టింది. ఆ తర్వాత బ్యాటింగ్ లోనూ రాణించిన పెర్రీ అజేయంగా 40 పరుగులు చేసింది. పెర్రీ ఆల్ రౌండ్ ప్రదర్శనతో ముంబై 19 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. ఆ తర్వాత ఆర్‌సీబీ 15 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఎల్లిస్ పెర్రీ చిరస్మరణీయమైన ఆల్ రౌండ్ ప్రదర్శనతో RCB ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. ఎలిమినేటర్ మ్యాచ్‌లోనూ ఇదే ప్రదర్శన ఆశిస్తోంది ఆర్సీబీ యాజమాన్యం.

సీఏఏ అమలును రాష్ట్రాలు అడ్డుకోవచ్చా?

కేంద్రం తీసుకొచ్చిన సీఏఏను అమలు చేయబోమని పలు రాష్ట్రాలు ప్రకటించాయి. అయితే ఏదైనా చట్టం పార్లమెంటులో ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రాలు అడ్డుకునే అవకాశం ఉండదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కాకపోతే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావొచ్చని అంటున్నారు. కాగా సీఏఏ కోసం నేరుగా కేంద్రం తెచ్చిన వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకునేవారిని ప్రభుత్వాలు ఎలా అడ్డుకుంటాయనే ప్రశ్న తలెత్తుతోంది.

వరల్డ్‌కప్‌లో కొత్త నిబంధన..
'స్టాప్ క్లాక్' అంటే తెలుసా..?

అంతర్జాతీయ క్రికెట్‌లో టెక్నాలజీ భాగమై పోయింది. వీటిలో అంపైర్ల నిర్ణయాన్ని సవాల్ చేసే డీఆర్ఎస్ ఎంతో పాపులర్. త్వరలోనే మరో కొత్త నిబంధన క్రికెట్‌లో భాగం కానుంది. ఇన్నాళ్లు ప్రయోగ దశలో ఉన్న 'స్టాప్ క్లాక్ రూల్'ను ఐసీసీ ఇకపై శాశ్వతం చేయనుంది. జూన్‌లో వెస్టిండీస్, అమెరికా గడ్డపై జరిగే టీ20 వరల్డ్‌కప్‌తో ఈ నియమాన్ని పూర్తి స్థాయిలో అమల్లోకి తేనుంది. ఈ విషయాన్ని ఐసీసీ తాజాగా వెల్లడించింది.

ఐదు పరుగుల పెనాల్టీ

స్టాప్ క్లాక్ నియమాన్ని అమలు చేయాల్సిన బాధ్యత అంపైర్లదే. ఓవర్ పూర్తికాగానే థర్డ్ అంపైర్ టైమర్ ఆన్ చేస్తాడు. 60 సెకన్ల లోపు బౌలింగ్ జట్టు కొత్త ఓవర్ వేయాలి. ఒకవేళ అలా చేయలేకపోతే ఫీల్డ్ అంపైర్ రెండు సార్లు హెచ్చరిస్తాడు. అయినా సరే సమయంలోపు ఓవర్ వేయకుంటే చివరకు ఐదు పరుగుల పెనాల్టీ విధిస్తాడు.

నష్టాల్లో స్టాక్ మార్కెట్

అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల మధ్య దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:26 గంటల సమయంలో సెన్సెక్స్ 131 పాయింట్ల నష్టంతో 72,966 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 39 పాయింట్లు కుంగి 22,106 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.82.92 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో పవర్ గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, ఎస్‌బీఐ, ఎన్‌టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, నెస్లే ఇండియా, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఇన్ఫోసిస్, ఎం అండ్ ఎం, యాక్సిస్ బ్యాంక్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

జపాన్‌లో భారీ భూకంపం

జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 5.8గా నమోదైనట్లు జపాన్ వాతావరణ కేంద్రం తెలిపింది. టోక్యోకు ఈశాన్యంగా 208 కిలోమీటర్ల దూరంలో పుకుషిమా ప్రిఫెక్చర్ తీరంలో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. ఆ ప్రాంతంలో బలమైన భూ ప్రకంపనలు నమోదైనట్లు వెల్లడించింది. అయితే ప్రస్తుతానికి సునామీ వంటి హెచ్చరికలు ఏమీ చేయలేదని తెలిపింది. బలమైన భూ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. ఈ భూకంపం ఘటనలో ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించి ఎలాంటి సమాచారం లేదు.

అయోధ్య రామయ్యకు 1,100 కిలోల ఢమరుకం

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య బాలరాముడికి మధ్యప్రదేశ్‌కు చెందిన శివ బరాత్ జన్ కల్యాణ్ సమితి బృందం 1,100 కిలోల ఢమరుకాన్ని కానుకగా సమర్పించింది. దీనిని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందజేసింది. ఈ తబలాను వాయించినప్పుడు దీని శబ్దం కొన్ని కిలోమీటర్ల వరకు వినిపిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఇది 6 అడుగుల ఎత్తు, 33 అడుగుల వెడల్పు ఉంది. దీనికి ఇప్పటికే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో కూడా చోటు దక్కింది.

టిక్‌టాక్‌ను బ్యాన్ చేసిన దేశాలివే!

చైనాకు చెందిన ప్రముఖ యాప్ టిక్‌టాక్‌ను పలు దేశాలు బ్యాన్ చేస్తున్నాయి. వ్యక్తిగత డేటాను సేకరించడం, గూఢచర్యం కార్యకలాపాలు నిర్వహించడం కోసం చైనా ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగిస్తున్నట్లు గతంలోనే భారత ప్రభుత్వం తెలిపింది. జూన్ 2020లో భారత్ టిక్‌టాక్‌ను నిషేధించింది. తర్వాత EU, ఆస్ట్రేలియా, బెల్జియం, కెనడా, ఫ్రాన్స్, న్యూజిలాండ్, UK, ఆఫ్ఘనిస్తాన్‌తో సహా తాజాగా అమెరికా సైతం ఈ యాప్‌ని నిషేధించింది.

బీఎస్పీకి రెండు సీట్లిచ్చిన బీఆర్ఎస్

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ - బీఎస్పీ పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై స్పష్టత వచ్చింది. పాత్తులో భాగంగా బీఎస్పీకి 2 సీట్లు కేటాయించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఇరుపార్టీల మధ్య చర్చల అనంతరం మాజీ సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. నాగర్ కర్నూల్, హైదరాబాద్ పార్లమెంటు స్థానాలను బీఎస్పీకి కేటాయిస్తున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. కాగా ఈ రెండు స్థానాల్లో పోటీ చేయనున్న అభ్యర్థులను బీఎస్పీ ఎంపిక చేసి ప్రకటించనుంది.